క్లుప్తంగా

అహోబిలం అసోసియేట్ మేనేజర్‌గా వైకుంఠం



ఆళ్లగడ్డ: అహోబిలం అసోసియేట్ మేనేజర్‌గా వైకుంఠం ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. మఠం నిర్వాహకుల ఆదేశాల మేరకు స్థానిక జనరల్ మేనేజర్ మురళిధరన్ వైకుంఠంను అసోసియేట్ మేనేజర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు దేవస్థాన కార్యాలయంలో బాధ్యతలు స్వీరించిన వైకుంఠం.. దేవస్థాన అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కొనసాగుతున్న తిరుప్పావై ప్రవచనాలు



హయగ్రీవాచారి

నంద్యాల(వ్యవసాయం): ధనుర్మాసాన్ని పురస్కరించుకొని సంజీవ నగర్ రా మాలయంలో శ్రీభగవత్ సేవా సమాజ్, తిరుమల తిరుపతి ఆల్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో డాక్టర్ దీవీ హయగ్రీవాచార్యులు 29వ పాశురాన్ని భక్తులకు వినిపించారు. ఆయన మాట్లాడుతూ గోదాదేవి, శ్రీకృష్ణుడు గోకులంలో జన్మించుట, యాదవుల మహాభాగ్యమన్నారు. పరిపూర్ణ కల్యాణ గుణగణాలతో ప్రకాశించేది శ్రీకృష్ణ భగవానుడు అన్నారు. ఈ పాశురం స్వామి వారి గొప్పతనం గురించి గోదాదేవి గోపికలకు వివరించిన ఘట్టాన్ని భక్తులకు వివరించారు.

దేశ భక్తి గీతాల ఆడియో ఆవిష్కరణ



ఆడియోను ఆవిష్కరిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని జాతీయ యువజన ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక వివేకానంద ఆడిటోరియంలో కళారాధన, సాంస్కృతిక సంస్థలు, ఐఎంఏ, లయన్స్‌క్లబ్, రోటరీ క్లబ్ శ్రీకృష్ణ ఆధ్యాత్మిక చానల్ రూపొందించిన శృతి సాగరం, దేశ భక్తి గీతాల ఆడియో ఆల్బంను ఆవిష్కరించారు. డాక్టర్ మధుసూదనరావు, డాక్టర్ రామకృష్ణారెడ్డి, రవికృష్ణ మాట్లాడుతూ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వైవీఎస్ నారాయణ రెడ్డి రచించిన గీతాలకు ప్రభుత్వ ఉపాధ్యాయులు పవన పుత్రారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి సంగీత దర్శకత్వం వహించి గానం చేశారన్నారు. అన్నెం శ్రీనివాసరెడ్డి, సుధాకర్, నిజాముద్దీన్, మధుసూదన్, బాలకృష్ణ పాల్గొన్నారు.

మూల పెద్దమ్మకు ప్రత్యేక పూజలు



దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారికి ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. వేకువజామునుంచే మహిళలు అమ్మవారిని దర్శించుకుని అభిషేకాలు, హారతులు పట్టారు. గాజులు, నిమ్మకాయలు, చీరలు, పిండివంటలు మొక్కుగా చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ట్రాక్టర్ బోల్తా.. ఒకరికి తీవ్ర గాయాలు

రుద్రవరం: మండలంలోని అప్పనపల్లె వద్ద ట్రాక్టరు కాల్వలో బోల్తా పడటంతో పెద్దయ్య అనే యువకుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పొలంలో వ్యవసాయ పనుల నిమిత్తం అప్పనపల్లె వద్ద 19వ బ్లాక్ తెలుగుగంగ ఉప ప్రధాన కాల్వ కట్టపై పెద్దయ్య ట్రాక్టరును నడుకుంటూ వెళ్తుండగా ప్రమాద వశాత్తు అదుపు తప్పి కాల్వలో బోల్తా పడింది. దీంతో పెద్దయ్యకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు వివరించారు.

ఉరేసుకుని వివాహిత బలవన్మరణం

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణానికి చెందిన మహాలక్ష్మి (46) అనే వివాహిత ఆదివారం ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. స్థానిక సంగపేటలోని చింతరగు వీధికి చెందిన మహాలక్ష్మి కొంత కాలంగా అనారోగ్య సమస్యతో బాధపడుతుండేది. దీంతో జీవితంపై విరక్తి చెంది ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలికి ఇద్దరు కుమారులు, భర్త ఉన్నారు. భర్త మధుసూదన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

కదిలిన అహోబిలేశుడి సైన్యం

- పార్వేట ఉత్సవాల్లో పల్లకీకి ముందు సాగుతున్న బుడగ జంగాలు
- గిద్దలూరు నుంచి వస్తున్న వందలాది కుటుంబాలు
- రిక్షాలు, సైకిళ్లపై సామగ్రితో అహోబిలం చేరుకుంటున్న వైనం
- పల్లకోత్సవం పూర్తయ్యే వరకు స్వామి వెంటే..
- అనాదిగా వస్తున్న ఆచారం



ఆర్.నాగులవరం సమీపంలో రిక్షాలపై వెళ్తున్న బుడగ జంగాల వారు



రిక్షాపై సామగ్రితో వస్తున్న దృశ్యం

రుద్రవరం: పూర్వం రాజులకు వేట అంటే ఎంతో సరదా. అప్పుడప్పుడు వేటకు వెళ్తూ తమ సరదాలు తీర్చుకునేవారు. వేట అనగానే సందడి ప్రత్యేకంగా ఉండేది. రాజు ముందు రక్షణగా వందలాది సైన్యం నడిచేది. అలాగే.. అహోబిల నరసింహ స్వామి వారి పార్వేట కూడా సాగుతోంది. అయితే రాజులు గుర్రాల మీద అటవీ ప్రాంతంలో జంతువుల వేటకు వెళ్తే.. అహోబిలేశుడు మాత్రం బ్రహ్మోత్సవాల్లో భాగంగా జరిగే తన కల్యాణోత్సవానికి సపరివార సమేతంగా తరలి రావాలని ప్రజలను ఆహ్వానించేందుకు గ్రామాల్లో పార్వేట కొనసాగిస్తారు. నాడు రాజులకు సైన్యం వెంటరాగా అహోబిలేసుడికి మాత్రం ప్రకాశం జిల్లా గిద్దలూరు నలబండ బజారుకు చెందిన వందల కుటుంబాలు సైన్యంగా సాగుతున్న వైనమిది..

సంక్రాంతితో పార్వేట మొదలు..

అహోబిల లక్ష్మీనరసింహ స్వామి వారు ఏటా మకర సంక్రాంతి రోజున పార్వేటకు బయలుదేరడం ఆనవాయితీ. పల్లకీలో జ్వాలా నరసింహ స్వామి, ప్రహ్లాదవరద స్వామి కొలువుదీరగా బోయిలు పల్లకీని అహోబిలం నుంచి ఆళ్లగడ్డ మండలం బాచేపల్లె మీదుగా రుద్రవరం, ఉయ్యాలవాడ, ఆళ్లగడ్డ మండలాల్లో మొత్తం 44 గ్రామాల్లో పర్యటించి విశేష పూజలందుకొని తిరిగి అహోబిలం చేరుకుంటారు. అయితే పార్వేట సాగడానికి పది రోజులు ముందుగానే ప్రకాశం జిల్లా గిద్దలూరులోని నలబండ బజారుకు చెందిన వందలాది కుటుంబాల బుడగ జంగాల వారు ఇళ్లకు తాళాలు వేసి కుటుంబ సమేతంగా అహోబిలానికి తరలి రావడం అనాదిగా వస్తోంది. వారు పొలాల పనులు, పిల్లల చదువులు అన్నీ వదిలేసి వస్తు సామగ్రిని సైకిల్లు, రిక్షాలపై వేసుకొని కదులుతారు. గిద్దలూరు నుంచి గాజులపల్లె, మహదేవపురం నుంచి రుద్రరవరం, నర్సాపురం మీదుగా అహోబిలానికి చేరుకుంటున్నారు. దారిలో వెళ్లే సమయంలో రాత్రిళ్లు బయలు ప్రదేశాల్లో గుడారాలు వేసుకొని బస చేయడం, తెల్లారగానే మళ్లీ తమ నడకను సాగిస్తారు. ఇలా అహోబిలంలో పార్వేట మొదలయ్యే సమయానికి అక్కడికి చేకుంటారు. స్వామివారి పల్లకీ బయలు దేరగానే ఆయన కంటే ముందుగా సైన్యంలా బుడగ జంగాల వారు నిర్ణయించిన గ్రామాలకు చేరుకుంటారు. రాత్రి పూట గ్రామాల్లో బస చేసిన చోట వీరు పల్లకీ చుట్టూ కాపాలా ఉండటం వీరి విధి. ఇలా పార్వేటోత్సవం పూర్తయ్యేంత వరకు స్వామి వారి వెంట సైన్యంగా ఉంటూ సేవలందిస్తున్నారు. వీరికి ఆయా గ్రామాల్లో రైతులు, పెద్దలు తమకు తోచినంత ధాన్యం, డబ్బు దానంగా ఇస్తారు. ఇక పల్లకీ కొలువుదీరిన చోట తెలుపు యజమానులు వారికి భోజన వసతి కల్పిస్తారు.

ఎలాంటి ఆస్తి పాస్తులు లేవు



అహోబిల లక్ష్మీనరసింహ స్వామి వారి పార్వేటోత్సవంలో సైన్యంగా ముందుండి నడవడం మా పెద్దల కాలం నుంచి ఆనవాయితీగా వస్తోంది. మా తరం వరకు ఇలాగే కొనసాగిస్తాం. రాబోయే పిల్లల కాలంలో సాగించడం కష్టం కావచ్చు. తాము మాత్రం స్వామి వారి వెంట ఉండి భిక్షాటన చేస్తాం. అయితే కొన్ని కుటుంబాల వారికి కాస్తా,కూస్తో మిగులుతుంది.మరి కొందరికి ఏమీ మిగలదు. అయినా స్వామి సేవలో పాల్గొంటాం. గిద్దలూరు ఎమ్మెల్యేగా అన్నారాం బాబు ఉన్న సమయంలో గిద్దలూరులో తమ జాతి వారికి 50 ఇళ్లు మంజూరు చేయించారు. దీంతో వారికి మాత్రమే ఇళ్లు ఉన్నాయి. మిగిలిన వారి ఇళ్లు, పొలాలు వంటి ఆస్తి పాస్తులు లేవు. తాము వ్యవసాయ కూలీ పనులతో జీవనం సాగిస్తున్నాం. తమ పిల్లల్లో కొందరు ఉన్నత చదువులు చదివినా ఉద్యోగాలు లభించడం లేదు. ప్రభుత్వం నుంచి కానీ, ఇటు అహోబిల దేవస్థానం నుంచి కానీ తమకు సాయమందడం లేదు.

– ఈబూది గణపతి,గిద్దలూరు

మహిళలకు ముగ్గుల పోటీలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని మారుతి టౌన్‌షిప్‌లో ఆవోపా ఆధ్వర్యంలో మహిళలకు ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. అధ్యక్షుడు ఆత్మకూరు సుబ్రహ్మణ్యం, సముద్రాల మధుసూదనరావు మాట్లాడుతూ ఆవోపా ఆధ్వర్యంలో వృద్ధాప్య పింఛన్లు, చిరు వ్యాపారులకు వడ్డీలేని రుణాలు, విద్యార్థులకు రుణాలు అందజేస్తున్నామన్నారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మాధవికి ప్రథమ బహుమతిగా రూ.5వేలు, ద్వితీయ బహుమతిగా గుండా శారదా రూ.3వేల, తృతీయ బహుమతిగా శేగు హేమలతకు రూ.2వేలు అందజేశారు. కన్సోలేషన్ బహుమతిగా ప్రతి ఒక్కరికి రూ.వెయ్యి అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా చిత్తలూరి రాం ప్రసాద్, రంగనాథలు వ్యవహరించారు. సహదేవయ్య, రామకృష్ణ, కాల్వ సురేష్, పెసల జనార్ధన్‌శెట్టి పాల్గొన్నారు.

జూదమాడితే కఠిన చర్యలు

రుద్రవరం: సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని గ్రామాల్లో కోడి పందేలు,పేకాట వంటి జూదాలు పూర్తిగా నిషేధమని ఎవరైనా ఇలాంటి వాటిని నిర్వహించినా,ఆడినా చట్ట పరమైన చర్యలు ఉంటాయని శిరివెళ్ల సీఐ వంశీధర్ హెచ్చరించారు.ఆదివారం ఆయన మాట్లాడుతూ.. సర్కిల్ పరిధిలోని శిరివెళ్ల,రుద్రవరం మండలాల్లో సంక్రాంతి పండుగను సంప్రదాయబద్ధంగా నిర్వహించుకోవాలని కోరారు. కుటుంబ సభ్యులతో సంతోషంగా జరుపుకోవాలని, క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అలా కాకుండా కోడి పందేలు, ఇతర జూదాలకు పాల్పడి సంస్కృతిని దెబ్బతీయరాదని సూచించారు. ఎక్కడైన ఇలాంటివి సాగుతున్నట్లు తెలిస్తే తమకు సమాచారం అందించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలి



ఉయ్యాలవాడలో రక్తదానం చేస్తున్న యువకులు

ఉయ్యాలవాడ : స్వామి వివేకానందను యువత ఆదర్శంగా తీసుకోవాలని నంద్యాల రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ అంకన్న పేర్కొన్నారు. ఆదివారం ఉయ్యాలవాడలో రేనాటి సూర్య చంద్రుల సేవా సమితి ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవం నిర్వహించారు. అలాగే స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 25 మంది యువకులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో సమితి ఆర్గనైజర్ కోట్లో బాబు, విశ్వహిందూ పరిషత్ ఖండ ఉపాధ్యక్షుడు ముసాని విశ్వనాథరెడ్డి, మోహనకృష్ణ, హసీనా, కోశాధికారి అర్జిగారి నరసింహులు, సుబ్బరాయుడు, అబ్దుల్ జిలానీ, ఫక్రుద్దీన్, అభినాష్, పాల్గొన్నారు.

నంద్యాల(వ్యవసాయం): విశ్వానికి భారతీయతను చాటిన స్వామి వివేకానంద నేటి యుతరానికి ఆదర్శమని పలువురు వక్తలు పేర్కొన్నారు. వివేకాంద జయంతిని పురస్కరించుకొని స్థానిక వివేకానంద కూడలిలో స్వామి వివేకానంద కాంస్య విగ్రహానికి గణేష్ కేంద్ర సమితి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. మేడా మురళీధర్, శ్రీనివాససింగ్, నాగేంద్ర, చలంబాబు, నిమ్మకాయల సుధాకర్, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

శిరివెళ్ల: యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఇంద్రావతి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే మండల కేంద్రంలో బీసీ సంఘం నాయకుడు మంగళి రమణ ఆధ్వర్యంలో నివాళులర్పించా ఆయన సేవలను కొనియాడారు. వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులరెడ్డి, ఆధ్యాపకులు పాల్గొన్నారు.

గ్రీన్‌కో మోసం కనిపించలేదా?



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

నంద్యాల(న్యూటౌన్): పిన్నాపురంలో గ్రీన్‌కో చేసిన కంపెనీ అక్రమాలు.. పిన్నాపురం రైతులు, గుమితం తండా గిరిజనులకు ఆ కంపెనీ చేసిన మోసం కనిపించలేదా అని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను సీపీఎం నంద్యాల జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్ ప్రశ్నించారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రీన్‌కో కంపెనీ రూ. 2.50 లక్షల కోట్లు పెట్టుబడి పెట్టిందని, ఇప్పటికే 12వేల మందికి ఉద్యోగాలు ఇచ్చారని, మరో 50వేల మందికి పరోక్షంగా ఉపాధి దొరుకుతుందని పవన్ కల్యాణ్ ప్రకటించారన్నారు. గ్రీన్‌కో కంపెనీలో ఉద్యోగాలు ఎవరికి ఇచ్చారని, పిన్నాపురంలో 1500 జనాభా ఉంటే 150 మందికి కూడా ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. గుమితం తండాలో 500 మంది జనాభా ఉంటే 70 మందికి కూడా ఉపాధి చూపలేదన్నారు. ఈ గ్రామాల రైతులు భూములు కోల్పోయారని, 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని, భూమి లేని పేదలకు పునరావాసం అమలు చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం పేద ప్రజలపైన విద్యుత్ చార్జీల భారం తగ్గిస్తామని ఎన్నికల్లో వాగ్దానం చేసి ఇప్పుడు రూ.6వేల కోట్లు ప్రజలపై భారం మోపిందన్నారు. దీనికి నిరసనగా భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను దగ్ధం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, నాగేశ్వరరావు, సీపీఎం, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏసురత్నం, రామచంద్రుడు, నాగరాజు, నరసింహనాయక్ పాల్గొన్నారు.

కత్తెర పురుగు నివారణకు చర్యలు చేపట్టిండి



మొక్కజొన్న పైరును పరిశీలిస్తున్న ఏఓ

గోస్పాడు: రైతులు మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణ చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారి స్వప్నికారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కానాలపల్లె గ్రామంలో మొక్కజొన్న పంటలో తెగుళ్లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో రైతులు సాగు చేసిన పొలాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ మండలంలో 52 హెక్టార్లలో మొక్కజొన్న, 2,568 హెక్టార్లలో జొన్న సాగు చేశారన్నారు. మొక్కజొన్నలో కత్తెర పురుగుతో ఎక్కువ నష్టం జరగక ముందే చర్యలు తీసుకోవాలని సూచించారు. పురుగు ఉధృతి తక్కువగా ఉన్నప్పుడు ఫ్లోరిపైరీపాస్ 2 ఎంఎల్ మందును లీటరు నీటికి లేదా ఫినాల్‌పాస్ 2 ఎంఎల్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని తెలిపారు. పురుగు అధికంగా ఉంటే ఇమామెట్టిన్ బెంజోయేట్ 0.4గ్రాముల మందును లీటరు నీటికి, స్పినోసాద్ 0.3ఎంఎల్ మందును లీటరు నీటితో ఆకు సుడులలో పిచికారీ చేయాలని చెప్పారు.

మహానందిలో భక్తజన సందడి



కోనేరులో భక్తుల స్నానాలు

మహానంది: ఆదివారం సెలవు రోజు కావడంతో మహానంది ఆలయంలో భక్తుల సందడి కొనసాగింది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయానికి చేరుకుని శ్రీ కామేశ్వరీ దేవి, శ్రీ మహానందీశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం స్వామి, అమ్మవారికి స్థానిక అభిషేకం, కుంకుమార్చన, అష్టవిధ మహా మంగళ హారతులు, మంత్రపుష్పం పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులు ముందుగా కోనేరుల్లో పుణ్య స్నానాలు ఆచరించి స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు.

మహానందీశ్వరుడికి అన్నాభిషేకం

మహానందిలో లోక కల్యాణార్థం మహానందీశ్వర స్వామి వారికి ఆదివారం అన్నాభిషేకం పూజలు వైభవంగా నిర్వహించారు. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని, ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, అర్చకులు వేద మంత్రాలతో స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం పూజలను అత్యంత వైభవంగా చేపట్టారు. హైదరాబాద్ వాస్తవ్యులు వారణాసి రామ్మోహన్ రావు, విజయలక్ష్మి దంపతుల సహకారంతో అన్నాభిషేకం పూజలను నిర్వహించినట్లు ఆలయ పండితులు తెలిపారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు



గురువులతో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని విజయవాణి పబ్లిక్ స్కూల్ పాఠశాలలో 2003 సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు రాజమల్లయ్య, నారాయణమూర్తిని సత్కరించారు. ఒకే వేదికపై కలవడంతో నాటి స్మృతులను, చిలిపి చేష్టలను, జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

అ'పూర్వ' కలయిక

రుద్రవరం: స్థానిక కన్యకా పరమేశ్వరీ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1999–2000లో 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 25 ఏళ్ల తరువాత ఒకే చోట కలుసుకోవడంతో ఆ ప్రాంతం కోలాహలంగా మారింది. ఈ సందర్భంగా నాటి తీపి గుర్తులు స్మరించుకుంటూ.. ఒకరి నొకరు యోగక్షేమాలు తెలుసుకుంటూ సంతోషంగా గడిపారు. అనంతరం రిటైర్డు ఎంఈఓ సాహెబ్‌వుశేన్, ఉపాధ్యాయులు సుబ్బరాయుడు, నాగరాజు, మహబుబ్ సాహెబ్, హెచ్ఎం సుబ్బరాయుడు, సుబ్బరత్నంను ఘనంగా సత్కరించారు.

రూ.వంద కోసం దాడి

రుద్రవరం: మండలంలోని బి.నాగిరెడ్డిపల్లెలో రూ.వంద కోసం వెంకటేశ్వర్లు అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన బాలరాజు,పాములేటి దాడి చేసి గాయపరిచారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బాధితుడు నిందితుల ట్రాక్టరులో కూలీ పనులకు వెళ్లేవాడు. రోజు వారీ లాగే.. ఆదివారం కూడా పనులకు వెళ్లాడు.సాయంత్రం కూలీ సొమ్ము అడగ్గా రూ.300 ఇచ్చారు. మరో రూ.వంద రావాల్సి ఉందని.. అది కూడా ఇవ్వాలని అడిగాడు. ఆ రూ.వంద కోసం వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకొంది. నిందితులు ఆగ్రహంతో కర్రతో వెంకటేశ్వర్లు తలపై కొట్టగా తీవ్ర గాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. సమస్యలపై మండల ప్రజలు వినతులు అందజేయవచ్చునన్నారు. రెవెన్యూ కార్యాలయంలో జరిగే కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

రేపు బండలాగుడు పోటీలు

కొత్తపల్లి: తాండవ మల్లేశ్వరస్వామి తిరునాల సందర్భంగా మంగళవారం అంతర్రాష్ట్ర ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు క్యాతం శ్రీనివాసులు యాదవ్, పి.లింగారెడ్డి, బి.నారాయణరెడ్డి, శివలింగారెడ్డి, నగిరి వెంకటరమణ తెలిపారు. పోటీల్లో 6, 6 పండ్లలోపు వృషభాలు మాత్రమే పాల్గొనాలని చెప్పారు. ఆసక్తి ఉన్న ఎడ్ల యజమానులు ఈ నెల 14వ తేదీ ఉదయం 7:30లోపు రూ.500 ప్రవేశ రుసుం చెల్లించి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. విజేతలకు దాతల సహకారంతో వరుసగా రూ.30వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.8వేలు, రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలు చొప్పున అందజేయనున్నట్లు వెల్లడించారు. వివరాల కోసం 7093873824, 8247224985 నంబర్లను సంప్రదించాలని కోరారు.

15 నుంచి పడమర ప్రాతకోటలో..

పగిడ్యాల: సంక్రాంతిని పురస్కరించుకుని మండలంలోని పడమర ప్రాతకోట నందీశ్వర, కాశీవిశ్వేశ్వరస్వామి తిరునాల సందర్భంగా ఈనెల 15వ తేదీ నుంచి రెండు రోజుల పాటు బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అంతర్రాష్ట్ర స్థాయి న్యూ కేటగిరి విభాగంలో రూ. 600 ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ నెల 16న 6 పళ్ల విభాగంలో పోటీలు జరుగుతాయన్నారు. అలాగే ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు(హోమ్ టీమ్స్) ఉంటాయని రూ. 400 ఎంట్రీ ఫీజు చెల్లించి జట్ల పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఒక టీంలో ఆడేవారు మరో టీంలో ఆడే అవకాశం ఉండదన్నారు. వివరాలకు 9704453115, 7995467032 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నివాళి

చాగలమర్రి: మండలంలోని శెట్టివీడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎర్రోల్ల చిన్న ఓబులేసు (77) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పార్టీ రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ బాబులాల్, మండల అధ్యక్షుడు జి.కుమార్‌రెడ్డి మృత దేహన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. సర్పంచ్ లక్ష్మీదేవి, రాష్ట్ర సేవాదళ్ ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు గణేష్ రెడ్డి, చిన్నరెడ్డి తదితరులున్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): మాజీ సైనికుడు దౌలత్‌ఖాన్ మృతికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇన్సాఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాబాఫక్రుద్దీన్ ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. మున్సిపల్ కమిషనర్ విధుల్లో చేరినప్పటి నుంచి అవినీతికి అంతులేకుండా పోయిందని ఆరోపించారు. ఇంటి పన్ను విషయంలో కొద్ది నెలలుగా అధికారుల చుట్టూ తిరిగినా నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు అవమానంతోగుండెపోటుతో మృతి చెందారన్నారు.

కలర్‌ఫుల్ కంకులు

- ఒకే పంట..మూడు రంగులు
- లాభదాయ పంటగా జొన్నసాగు
- మండలంలో తెల్ల,ఎర్ర, పచ్చ జొన్న సాగు

దొర్నిపాడు: మండలంలో ప్రస్తుతం ఎక్కడ చూసినా జొన్న పంటలే అధికంగా కనిపిస్తున్నాయి. అయితే ఒక్కో చోట ఒక్కో రంగులో కనిపిస్తున్నాయి. తెలుపు, ఎరుపు, పచ్చ జొన్న పంటలు దర్శనమిస్తున్నాయి. ఇలా ఒకే పంట మూడు రంగుల్లో కనిపిస్తుండటంతో రోడ్డున వెళ్లే వారు వాటి ప్రత్యేకత గురించి తెలుసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. తెలుపు, పచ్చజొన్న వినియోగం గురించి ఈ ప్రాంతంలో అధిక శాతం ప్రజలకు తెలుసు. కానీ ఇటీవల ఎర్రజొన్న సాగు కూడా అధికంగా కనిపిస్తోంది. నియోజకవర్గ వ్యాప్తంగా జొన్న పంటను సుమారు 7,300 హెక్టార్లలో సాగుచేశారు. ఎకరాలో పంట సాగుకు రూ.15వేల నుంచి రూ.20వేల వరకు ఖర్చవుతుంది. ప్రస్తుతం జొన్నపంట ఆశాజనకంగా ఉండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఖర్చు తక్కువగా ఉండటం, తెగుళ్ల బెడద అంతగా లేకపోవడం, దిగుబడి ఆశాజనకంగా ఉండటంతో పాటు, ధాన్యం తరువాత జొన్న చొప్ప పశువుల మేతగా ఉపయోగపడుతుండటంతో రైతులు సాగుకు మొగ్గు చూపుతున్నారు.



పచ్చజొన్న..

పచ్చజొన్న పంటలో చాలా పోషకవిలువలు ఉంటాయి. దీన్ని ముఖ్యంగా షుగర్ పేషంట్లకు ఆహారంగా వినియోగిస్తారు. అలాగే బిస్కెట్లు, వివిధ రకాల మందుల తయారీలో, బీర్ల తయారీలోనూ వినియోగిస్తారు. ఈ జొన్నలు క్వింటా రూ.2700–3వేల వరకు అమ్ముడుబోతున్నాయి.

తెల్లజొన్న..



తెల్లజొన్న రాయలసీమలో అధికంగా సాగుచేస్తారు. ఈ జొన్నలతో రొట్టెలు, సంగటి, రాగిసంగటిలో భాగంగా అధికంగా వినియోగిస్తారు. ప్రస్తుతం షుగర్ వ్యాధిగ్రస్తులు ఈ జొన్నలను అధికంగా వాడుతున్నారు. పదేళ్ల క్రితం జొన్న సాగు అంతంత మాత్రమే ఉండేది. వినియోగం పెరగడంతో తెల్లజొన్న సాగు అధికమైంది. మార్కెట్లో మంచి గిరాకీ ఉండటంతో పాటు క్వింటా జొన్నలు రూ.2,400 పైగా పలుకుతున్నాయి. దిగుబడులు కూడా ఎకరాకు 20 క్వింటాళ్లు వస్తుండటంతో రైతులకు లాభదాయకంగా మారింది.

ఎర్రజొన్న..



ప్రస్తుతం ఎర్రజొన్న పంట కోత దశలో ఉంది. ఈ పంట ముందుగా ఆకుపచ్చ రంగులో మొదలై.. తర్వాత తెలుపుగా మారి చివరిగా ఎర్ర కంకిగా తయారవుతుంది. దీన్ని ఢిల్లీ, హర్యానా, ఉత్తరప్రదేశ్, బళ్లారి ప్రాంతాల్లో పశువులకు దాణాగా వినియోగిస్తారు. అందుకే తెలంగాణా, ఏపీ తెలుగు రాష్ట్రాల రైతుల నుంచి ఒప్పంద ప్రాతికపదిన కొనుగోలు చేస్తారు. క్వింటా ఎర్రజొన్న రూ.3,600 నుంచి రూ.5వేల వరకు కొనుగోలు చేస్తారు. ఇక్కడి నుంచి అధికంగా హర్యానా రాష్ట్రానికి ఎగుమతి అవుతున్నాయి.